క్లుప్తంగా

నేటి నుంచి నూకాలమ్మ గరగ నృత్యాలు

రాజవొమ్మంగి: గ్రామదేవత నూకాలమ్మ గుడి తలుపులు ఆదివారం తెరుస్తున్నట్లు సర్పంచ్ రమణి, ఉత్సవ కమిటీ సభ్యులు శనివారం తెలిపారు. అదే రోజున అమ్మవారి ప్రతి రూపాలైన గరగలు పుట్టిల్లు విక్రమహంతి వారి ఇంటికి డప్పువాయిద్యాల నడుమ వెళతాయని వివరించారు. ఆ తర్వాత గరగలు గ్రామంలో రోజూ రాత్రి ఊరేగుతాయన్నారు. ఈ నెల 27వ తేదీ నుంచి రాజవొమ్మంగి నూకాలమ్మ అమ్మవారి జాతర ప్రారంభం అవుతుందని తెలిపారు. 30న తెల్లవారు జామున అమ్మవారి గుడి తలుపులు మూసివేస్తామన్నారు.

అడవుల సంరక్షణకు ప్లాస్టిక్ వాడవద్దు

- అడ్డతీగల సబ్ డీఎఫ్‌వో సుబ్బారెడ్డి



పింజరికొండ ఆర్‌ఎఫ్‌లో ప్లాస్టిక్ వ్యర్థాలు తొలగిస్తున్న సబ్ డీఎఫ్‌వో సుబ్బారెడ్డి తదితరులు

అడ్డతీగల: అడవుల సంరక్షణకు ప్లాస్టిక్ వాడవద్దని అటవీ శాఖ అడ్డతీగల సబ్ డీఎఫ్‌వో జె.వి. సుబ్బారెడ్డి తెలిపారు. స్వచ్ఛాంధ్ర –స్వచ్ఛ దివస్‌లో భాగంగా శనివారం పింజరికొండ రక్షిత అటవీ ప్రాంతంలో అడ్డతీగల అటవీ క్షేత్రాధికారి షేక్ షెహన్నా, డీఆర్వో రాజారావు, ఇతర సిబ్బంది ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు.

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు



బహుమతులు అందిస్తున్న ఎంపీపీ అనూషా దేవి, జెడ్పీటీసీ బాలయ్య, అధికారులు

చింతపల్లి: స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్రలో భాగంగా చింతపల్లి మండల పరిషత్ కార్యాలయం వద్ద శనివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. అంగన్‌వాడీ, ఆశ, డ్వాక్రా సంఘాల మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందించారు. ఎంపీపీ అనూషాదేవి, జెడ్పీటీసీ బాలయ్య, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంఈఓ ప్రసాద్ మండల ఉపాధ్యక్షురాలు శారద, చింతపల్లి సర్పంచ్ పుష్పలత పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థినులకు పరీక్ష అట్టల పంపిణీ



విద్యార్థినులకు పరీక్ష అట్టలు పంపిణీ చేస్తున్న కృష్ణకుమారి

పెదబయలు, పాడేరు రూరల్ : విద్యార్థులు టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని రాష్ట్ర మానవ హక్కుల వ్యతిరేక నేరాల సంఘం అధ్యక్షురాలు కె. కృష్ణకుమారి ఆకాంక్షించారు. శనివారం పెదబయలు, పాడేరు కేజీబీవీల్లో పదో తరగతి విద్యార్థినులకు పరీక్ష అట్టలను పంపిణీ చేశారు. పాఠశాల ఎస్‌వో చంద్రకళ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతోనే ఆరోగ్యం



కిలోగుడ బాలికల ఆశ్రమంలో కిశోరి వికాసం ఆకారంలో విద్యార్థినులు

డుంబ్రిగుడ: యుక్త వయస్సులో పోషకాహారాన్ని తీసుకుంటే ఆరోగ్యం పదిలంగా ఉంటుందని సీడీపీవో నీలిమ అన్నారు. మండలంలోని కిలోగుడ ఇంగ్లిష్ మీడియం బాలికల ఆశ్రమ పాఠశాలలో కిశోరి వికాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కిశోరి వికాసం ఆకారంలో విద్యార్థినులు కూర్చొని ఆకట్టుకున్నారు. అనంతరం పోషకాహారం, ఉన్నత చదువులపై ఆమె అవగాహన కల్పించారు. కిలోగుడ అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. ప్రధానోపాధ్యాయిని కళావతి, ఉపాధ్యాయుడు రాము, సిబ్బంది పాల్గొన్నారు.

వాసవీ క్లబ్ సభ్యురాలి మృతికి సంతాపం



కృష్ణకుమారి (ఫైల్)

సాక్షి,పాడేరు: వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ సభ్యురాలు, వర్తక సంఘం నేత ఉడా త్రినాథరావు భార్య కృష్ణకుమారి(53) మృతికి పలువురు సంతాపం తెలిపారు. ఆమె అనారోగ్యంతో శుక్రవారం రాత్రి పాడేరులోని తన నివాసంలో మృతి చెందారు. ఆమె మృతిపై పాడేరు, అరకులోయ ఎమ్మెల్యేలు మత్స్యరాస విశ్వేశ్వరరాజు, రేగం మత్స్యలింగం, మాజీ మంత్రులు పసుపులేటి బాలరాజు, మత్స్యరాస మణికుమారి, మాజీ ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, స్థానిక సర్పంచ్ కొట్టగుళ్లి ఉషారాణి, వాసవీ క్లబ్ ప్రతినిధులు, వర్తకులు విచారం వ్యక్తం చేశారు.

ఆశ్రమ నిర్వహణ ఎలా..

ఆశ్రమ పాఠశాలల్లో పేరుకుపోయిన బకాయిలు



ముంచంగిపుట్టులో భోజనం తీసుకుంటున్న విద్యార్థులు

తలలు పట్టుకుంటున్న నిర్వాహకులు

5 నెలలుగా విడుదల కానీ నిధులు

ముంచంగిపుట్టు, పెదబయలు మండలాల్లో రూ.4 కోట్లపైగా బకాయిలు

అప్పులు చేస్తున్న 25 పాఠశాల నిర్వాహకులు

‘అప్పులు చేసి ఆశ్రమ పాఠశాల నిర్వహణ చేస్తున్నాను. ఐదు నెలలుగా బిల్లులు మంజూరు కాకపోవడం వల్ల నిర్వహణలో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాను. ప్రతి నెలా బిల్లులు మంజూరు చేయాలి. మెనూ సక్రమంగా అమలు చేయకపోతే మాపై చర్యలు తీసుకుంటారు. బిల్లులు చెల్లించకుండా నెలల తరబడి నిర్వహణ చేయాలంటే కష్టంగా ఉంది. మా బాధలు, ఇబ్బందులు గ్రహించి వెంటనే బకాయి బిల్లులు చెల్లించాలి.’ ఇది ఒక ఆశ్రమ నిర్వాహకుడి ఆవేదన..

ముంచంగిపుట్టు: ఆశ్రమ పాఠశాల నిర్వహణ నిర్వాహకులకు గుదిబండగా మారింది. ఐదు నెలలుగా నిధులు విడుదల కాక బకాయిలు ఉండిపోవడంతో రోజూ విద్యార్థులకు అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనాలు పెట్టేందుకు నానా అవస్థలు పడుతున్నారు. దీనికి తోడు నిత్యావసర సరుకులు, కూరగాయల ధరలు పెరిగిపోవడంతో గగ్గోలు పెడుతున్నారు.

ఒక్కొక్క ఆశ్రమ పాఠశాలకు రూ.20 లక్షల వరకు బకాయిలు..

ముంచంగిపుట్టు, పెదబయలు మండలాల్లో 46 పంచాయతీలు ఉన్నాయి. ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలురు, బాలికల పాఠశాలలు, ప్రభుత్వ జూనియర్ కళాశాలలు కలిపి మొత్తం 25 ఉన్నాయి. 7,010 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఆశ్రమ నిర్వహణకు ప్రతి నెలా రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయాల్సి ఉంది. గతేడాది అక్టోబర్ నుంచి నిధులు మంజూరు కావడం లేదు. ఒక్కొక్క ఆశ్రమ పాఠశాలకు రూ.15 లక్షలు నుంచి రూ.20 లక్షల వరకు బకాయిలు ఉన్నాయి. రెండు మండలాలకు రూ.4 కోట్లకు పైగా నిధులు విడుదల కావాల్సి ఉంది. స్థానిక గిరిజన సహకార సంస్థ ద్వారా బియ్యం, పప్పులు, ఉప్పులు, నూనె, కారం మాత్రమే సరఫరా అవుతోంది. మిగిలిన కూరగాయలు, చికెన్, గ్యాస్ బండలు, అరటి పండ్లు, స్వీట్లు ప్రైవేట్ మార్కెట్‌లో కొనుగోలు చేసి విద్యార్థులకు పెడుతున్నారు. ప్రైవేట్ వ్యాపారులు సైతం నెల, రెండు నెలలు మాత్రమే ఆశ్రమాల నిర్వాహకులకు సరుకులు ఇచ్చి నిరీక్షిస్తున్నారు. ఐదు నెలల నుంచి పెట్టిన బిల్లులకు నిధులు విడుదల కాకపోవడంతో వారు అరువులు ఇవ్వడం మానేశారు. కూరగాయలు ఆశ్రమ పాఠశాలలకు సరఫరా చేసే రైతులు సైతం నెలల తరబడి డబ్బులు ఇవ్వకపోవడంతో కష్టమని తేల్చి చెప్పేస్తున్నారు. దాంతో ఆశ్రమాల నిర్వాహకులు ఏమి చేయాలో అర్థం కాక తలలు పట్టుకుంటున్నారు.



ఉదయం అల్పాహారంతో విద్యార్థులు

అప్పులు తెచ్చి నిర్వహణ..

ప్రతి పాఠశాల ఆశ్రమ నిర్వాహకులు 3 నుంచి 5 రూపాయల వరకు వడ్డీకి డబ్బులు తీసుకువచ్చి ఆశ్రమ పాఠశాలల నిర్వహణ చేస్తున్నారు. నెల నెల వడ్డీ పెరుగుతూ వస్తోంది తప్ప, బిల్లులు మాత్రం చెల్లించడం లేదు. ఆశ్రమ పాఠశాలల నిర్వాహకులు ఐదు నెలల బిల్లులు ఇప్పటికే పాడేరు ట్రెజరీకి అందించారు. ట్రెజరీ అధికారులు బిల్లులకు చెందిన అన్ని పనులు పూర్తి చేశారు. ప్రభుత్వం నుంచి ఎప్పుడు నిధులు విడుదల అవుతుందో అని వేచి చూస్తున్నారు. నిర్వాహకులకు వచ్చే జీతం సైతం ఆశ్రమ నిర్వహణకు పెట్టి, వడ్డీకి డబ్బులు తెచ్చి పెట్టి నిర్వహణ చేయాలంటే కష్టంగా ఉందని, తక్షణమే ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి నిర్వహణ కష్టాలను గుర్తించి నిధులు విడుదల చేసి, తమ బాధలు తీర్చాలని ఆశ్రమ పాఠశాలల నిర్వాహకులు మొర పెట్టుకుంటున్నారు.



ముంచంగిపుట్టు ఆశ్రమ పాఠశాలలో కొనుగోలు చేసి నిల్వ ఉంచిన కూరగాయలు

చేతల్లో చూపాలి



విద్యార్థులకు మంచి భోజనం పెట్టాలని, ఆశ్రమాల నిర్వహణ బాగుండాలని మాటలు చెప్పడం తప్ప క్షేత్ర స్థాయిలో ఇబ్బందులు పట్టించుకోకపోవడం అన్యాయం. వార్డెన్లు అప్పులు చేసి ఆశ్రమ పాఠశాలలను నిర్వహిస్తున్నారు. కూటమి పాలకులు ప్రకటనలతో కాలయాపన చేయడం, గొప్పలు చెప్పుకోవడం పక్కన పెట్టి బకాయి పడ్డ నిధులు విడుదల చేయాలి.

– ఎం.ఎం.శ్రీను, గిరిజన సంఘం జిల్లా నేత, ముంచంగిపుట్టు

మరికొన్ని రోజుల్లో నిధుల విడుదల



ముంచంగిపుట్టు, పెదబయలు మండలాలకు చెందిన ఆశ్రమ పాఠశాలల బిల్లులు ట్రెజరీకి అప్పగించాం. ట్రెజరీలో పనులు సైతం పూర్తయ్యాయి. నిధులు విడుదల అయిన వెంటనే నిర్వాహకుల ఖాతాలలో జమవుతాయి. నిర్వాహకులు ఆందోళన చెందాల్సిన పని లేదు. మరికొన్ని రోజుల్లో నిధులు విడుదల అవుతాయని ఉన్నతాధికారుల నుంచి సమాచారం ఉంది.

– స్వర్ణలత, ఏటీడబ్ల్యూవో, ముంచంగిపుట్టు

పాఠశాలలకు నిధులు మంజూరు చేయాలి

రంపచోడవరం జెడ్పీటీసీ పండా వెంకటలక్ష్మి



జిల్లా పరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ పండా వెంకటలక్ష్మి

రంపచోడవరం: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కాకినాడలో జరిగిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో రంపచోడవరం జెడ్పీటీసీ పండా వెంకటలక్ష్మి పాల్గొని గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలపై మాట్లాడారు. మండలంలో పూరి గుడిసెల్లో ఆరు పాఠశాలలను నిర్వహిస్తున్నారని వాపోయారు. వైఎస్సార్ సీపీ హయాంలో నాడు–నేడు నిధుల నుంచి ఒక్కో పాఠశాలకు రూ. 40 లక్షలు మంజూరు చేసిందన్నారు. వీటితో పనులు కొనసాగుతున్నాయన్నారు. ఇంకా పనులు పూర్తి చేసేందుకు కూటమి ప్రభుత్వం ఎటువంటి నిధులు మంజూరు చేయకపోవడం లా దారుణమన్నారు. డ్వాక్రా సంఘాలకు రుణాలు ఇచ్చి అధిక వడ్డీలు వసూలు చేస్తున్నారని తెలిపారు. రంపచోడవరం ఐటీడీఏలో ప్రతి మూడు నెలలకు ఒకసారి సర్వసభ్య సమావేశం నిర్వహిస్తే ప్రజాప్రతినిధులు అధికారులకు సమస్యలు తెలిపే అవకాశం ఉంటుందన్నారు.

కిల్లో శరభన్న మృతికి సంతాపం



శరభన్న పార్థివదేహం వద్ద జోహార్లు అర్పిస్తున్న సీపీఎం, గిరిజన సంఘాల నేతలు

పెదబయలు: సీపీఎం మండల నాయకుడు కిల్లో శరభన్న మృతి పార్టీకి తీరని లోటని పార్టీ జిల్లా కార్యదర్శి పి. అప్పలనర్స అన్నారు. గొంతు క్యాన్సర్‌తో బాధపడుతూ విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందారు. శనివారం స్వగ్రామం వడ్జేపుట్టులో నిర్వహించిన అంతిమయాత్రకు సీపీఎం, సీఐటీయూ, గిరిజన ప్రజా సంఘాల నేతలు సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. 15 ఏళ్లుగా సీపీఎంలో క్రమ శిక్షణ కలిగిన నాయకుడిగా సేవలందించారన్నారు. అనంతరం అంత్యక్రియాల్లో పాల్గొని విప్లవ జోహార్లు అర్పించారు. పార్టీ మండల కార్యదర్శి బొండా సన్నిబాబు, విశాఖ జిల్లా గిరిజన ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు బొండా తౌడన్న, అనంతగిరి జెడ్పీటీసీ దీసరి గంగరాజు, వి. ఉమామహేశ్వరరావు, అన్ని పార్టీల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన యువత క్రీడల్లో రాణించాలి



క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న సర్పంచ్ మాలన్న

జి.మాడుగుల: గిరిజన యువత క్రీడల్లో రాణించి ఉన్నత స్థానాలకు ఎదగాలని బొయితిలి సర్పంచ్ లసంగి మాలన్న తెలిపారు. మండలంలో బొయితిలి, మద్దిగరువు ఈ నెల 28 నుంచి 30వ తేదీ వరకు జరిగే రాసకొండ బాలచెల్లమ్మ జాతర పురస్కరించుకొని క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన శనివారం ప్రారంభించారు. గిన్నెలకోట ఎంపీటీసీ గడుతూరి కొండబాబు, ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం అప్పలకొండ, వైఎస్సార్‌సీపీ నాయకులు గావేలి రమణబాబు, బుటారి భవగాన్‌రావు, పీసా కమిటీ కార్యదర్శి లక్ష్మణ్‌రావు, వార్డు మెంబర్లు వాడేలి రెడ్డి, గావేలి నూకరాజు, గ్రామ నాయకులు సింహాద్రి, పూజారి రమణ కిదారి రమేష్ పాల్గొన్నారు.

జెడ్పీ చైర్‌పర్సన్ దృష్టికి సుజనకోట సమస్యలు



జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్రకు వినతి పత్రం అందిస్తున్న సర్పంచ్ రమేష్

ముంచంగిపుట్టు: మండలంలోని సుజనకోట పంచాయతీలో సమస్యలపై జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్రను శనివారం ఆమె నివాసంలో సర్పంచ్ వి.రమేష్ కలిసి వినతి పత్రం అందించారు. సుజనపేట, తోటపుట్టు, తాలబుతోట, గొడుగులపుట్టు, కుమ్మరిపుట్టు గ్రామాల్లో సీసీరోడ్లు మంజూరు చేయాలని, వర్షాకాలంలో వీధులు బురదమయంగా మారి నడవటానికి గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. జెడ్పీ నిధులతో సీసీ రోడ్లు ఏర్పాటు చేయాలని కోరారు. దీనికి జెడ్పీ చైర్‌పర్సన్ సానుకూలంగా స్పందించారు.

పేదింటి యువతి వివాహానికి ఆర్థిక సాయం



శ్రావణికి చెక్కు అందజేస్తున్న వాసవీ క్లబ్ ప్రతినిధులు

సాక్షి,పాడేరు: పట్టణంలోని పేదింటి ఆర్యవైశ్య యువతి ఐతంశెట్టి శ్రావణి పెళ్లి ఖర్చులకు వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు ఇరుకుల రామకృష్ణ రూ.25 వేల సాయం చేశారు. ఈ మొత్తం చెక్కును శనివారం శ్రావణికి వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ ఉపాధ్యక్షుడు శ్రీనాథు శ్రీను, వాసవీ క్లబ్ పాడేరు హిల్స్ క్లబ్ అధ్యక్షుడు పి.సంతోష్‌కుమార్, కార్యదర్శి రమేష్, కోశాధికారి అప్పారావు అందజేశారు.

ప్లాస్టిక్ వస్తువులు విక్రయిస్తే రూ.1,500 జరిమానా



అనంతగిరిలో ప్లకార్డులు ప్రదర్శించి, ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీడీవో కుమార్, తదితరులు

అరకులోయ టౌన్/అనంతగిరి: అరకులోయ, అనంతగిరి మండలాల్లో ఎంపీడీవోలు అడపా లవరాజు, ఏవీవీ కుమార్‌ల ఆధ్వర్యంలో శనివారం స్వచ్ఛాంధ్ర –స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవోలు మాట్లాడుతూ ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి ప్లాస్టిక్ బ్యాన్ చేస్తున్నామని, ప్లాస్టిక్ విక్రయాలను నిలిపివేయాలని దుకాణదారులకు సూచించారు. ప్లాస్టిక్ వస్తువులు విక్రయిస్తే రూ.1,500 జరిమానా విధిస్తామన్నారు. మరలా పునరావృతమైతే రూ. 3 వేలు జరిమానా విధిస్తామని హెచ్చరించారు. అరకులోయ మండలం, పద్మాపురం పంచాయతీలో జరిగిన కార్యక్రమంలో విజయనగరం రీజనల్ ఆర్టీసీ చైర్మన్ ఎస్. దొన్నుదొర, సర్పంచ్ పెట్టెలి సుస్మిత, ఎంపీటీసీ ఎల్. బి. భీమరాజు, నాయకులు బి.బి. లక్ష్మి, శెట్టి బాబూరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

- అనంతగిరి మండలంలో ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాలు, ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాల ఆవరణలో ఎంపీడీవో ఏవీవీ కుమార్, తహసీల్దార్ మాణిక్యం అధికారులు, పారిశుధ్య సిబ్బందితో కలిసి విశాఖ–అరకు ప్రధాన రహదారిలో తడి, పొడి చెత్త సేకరించి సంపద తయారీ కేంద్రానికి తరలించారు. ఏటీడబ్ల్యూ కె. వెంకటరమణ, ఈవోపీఆర్డీ పి. ధర్మ, ఎంఈవో బాలాజీ, ఏపీవో సన్యాశినాయుడు, ఆర్ఐ శంకర్రావు, సర్పంచ్ రూతు, కార్యదర్శి దేవా, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్ష కేంద్రాల పరిశీలన



అడ్డతీగలలో జెడ్పీ ఉన్నత పాఠశాల కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో శ్రీనివాసరావు తదితరులు

గంగవరం: స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలను తహసీల్దార్ సిహెచ్.శ్రీనివాసరావు శనివారం పరిశీలించారు. విద్యార్థులకు ఏవిధమైన ఇబ్బందులు లేకుండా తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ రెండు కేంద్రాల్లో 311 మంది విద్యార్థులు హాజరవుతారన్నారు.

జి.మాడుగుల: మండల కేంద్రంలో నాలుగు పరీక్ష కేంద్రాల్లో ఈ నెల 17 నుంచి పదో తరగతి పరీక్షలు జరుగుతాయని ఎంఈవో బాబూరావు పడాల్, ఏటీడబ్ల్యూవో జయ నాగలక్ష్మి తెలిపారు. జీఎం కొత్తూరు బాలుర ఆశ్రమ పాఠశాల కేంద్రంలో 150 మంది, గురుకులం కేంద్రంలో 190 మంది, గాంధీ నగరం బాలిక ఆశ్రమోన్నత కేంద్రంలో 137 మంది, ప్రభుత్వ ఉన్నత పాఠశాల కేంద్రంలో 95 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారన్నారు.

అడ్డతీగల: ఈనెల 17 నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఆశ్రమ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రాల్లో అన్ని వసతులు సిద్ధం చేసినట్లు ఎంఈవో పి.శ్రీనివాసరావు తెలిపారు. ఏర్పాట్లుపై శనివారం పరీక్షల సూపరింటెండెంట్లు, డిపార్టుమెంట్ ఆఫీసర్లు, ఉపాధ్యాయులతో కలసి పరిశీలించామన్నారు. రెండు కేంద్రాల్లో 364 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తారన్నారు. 18 మంది ఇన్విజిలేటర్లను రెండు చోట్ల కలిపి నియమించామన్నారు.

పెదబయలు: మండలంలో పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేశామని ఎంఈవో కొమ్ము కృష్ణమూర్తి అన్నారు. శనివారం పెదబయలులో జెడ్పీ ఉన్నత పాఠశాల, గురుకులం పాఠశాల, గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాల కేంద్రాల్లో 13 ఉన్నత పాఠశాలల నుంచి 626 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారన్నారు. వీరిలో తెలుగు మీడియం 417 మంది, ఇంగ్లిష్ మీడియం 209 మంది ఉన్నారన్నారు. ఎంఈవో–2 పుష్ప జోసెఫ్, పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు జి. సతీష్ శంకర్, చెట్టి నారాయణ డిపార్టుమెంట్ అధికారులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వినియోగానికి దూరంగా ఉండాలి



ముంచంగిపుట్టులో ప్రతిజ్ఞ చేయిస్తున్న డీడీ రజని



స్వచ్ఛాంధ్ర ర్యాలీలో పాల్గొన్న జెన్‌కో ఇంజనీర్లు, సిబ్బంది



అరకు డిగ్రీ కాలేజీ ఆవరణలో మొక్కలు నాటుతున్న విద్యార్థులు

ముంచంగిపుట్టు: పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్ వస్తువుల వినియోగానికి ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని పాడేరు గిరిజన సంక్షేమ శాఖ ఇన్‌చార్జి డిప్యూటీ డైరెక్టర్ రజని తెలిపారు. శనివారం స్థానిక వారపు సంతలో స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్‌లో భాగంగా ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలపై అధికారులు, విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో సూర్యనారాయణమూర్తి, ఈవోపీఆర్డీ చిన్నాన్న, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అరకు టౌన్: స్థానిక డిగ్రీ కళాశాలలో ఆవరణలో మొక్కలు నాటారు. చెత్తా చెదారాలను తొలగించి శుభ్రం చేశారు. అనంతరం వరల్డ్ కన్స్యూమర్ రైట్స్‌డే ఘనంగా నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె. పుష్పరాజ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల్లో ఎన్ఎస్ఎస్ పీవోలు పి.నాగబాబు, వై. విజయలక్ష్మి, ఎం. అనిత కుమారి, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

సీలేరు: ఏపీ జెన్‌కో, పంచాయతీ ఆధ్వర్యంలో సీలేరులో జెన్‌కో, వివిధ శాఖల ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు పరిశుభ్రం చేశారు. స్థానిక పీహెచ్‌సీ పరిసర ప్రాంతాలలో చెత్తను తొలగించారు. ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు ఎం శ్రీనివాసరెడ్డి, రాజేంద్రప్రసాద్, ఏడీఈ అప్పలనాయుడు, ఈఈ సురేష్ అనుదీప్ సర్పంచ్ దుర్గో, ఉప సర్పంచ్ వల్లీ ప్రసాద్ పాల్గొన్నారు.

కూనవరం: ప్లాస్టిక్ నిర్మూలనకు కృషి చేయాలని సబ్ డీఎఫ్‌వో కేవీ రాఘవరావు, ఎఫ్ఆర్వో ఎం కరుణాకర్ తెలిపారు. భగవాన్‌పురంలో నాగులమ్మ తల్లి గెద్ద సమీపంలో అవగాహన కల్పించారు. ఇక్కడ 8 బస్తాల ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించారు. స్థానిక గ్రామ పంచాయతీ, పోలీసు స్టేషన్, కోతులగుట్ట ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. డీఆర్‌ఓ అనిల్‌కుమార్, ఎఫ్ఎస్ఓలు సాయివెంకటరమణ, విజయలక్ష్మి, శంకర్ రెడ్డి, ప్రసన్నకుమార్, తహసీల్దార్ కె. శ్రీనివాసరావు, ఎంపీడీఓ రామాంజనేయ ప్రసాద్, ఎస్సై లతశ్రీ, సీహెచ్‌సీ సూపరింటెండెంట్ మహేష్‌బాబు, కార్యదర్శి సురేష్ పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: సర్పంచ్ రమణి ఆధ్వర్యంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. మూడు రోడ్ల కూడలి వద్ద మానవహారంగా ఏర్పడ్డారు. స్పెషల్ ఆఫీసర్ అంబేద్కర్, ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, సర్పంచ్ గొల్లపూడి రమణి, ఎంపీటీసీ పెద్దిరాజు, ఎంపీడీవో యాదగిరీశ్వరరావు, తహసీల్దార్ సత్యన్నారాయణ పాల్గొన్నారు.

కొయ్యూరు: అంగన్‌వాడీ కేంద్రాల ఆవరణల్లో శుభ్రం చేశారు. అనంతరం సిబ్బందితో కలిసి సీడీపీవో విజయకుమారి స్వచ్ఛాంధ్రకు కట్టుబడి ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు

జి.మాడుగుల: నుర్మతి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం అంబిడి శ్యామసుందరం ఆధ్వర్యంలో విద్యార్థులు, గ్రామస్తులకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేసారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్ నాయుడు, డిజిటల్ అసిస్టెంట్ సురేష్, వీఆర్పీ మత్స్యకొండబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అడ్డతీగల: ఎంపీడీవో కె.ఆర్. విజయ ఆధ్వర్యంలో స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల, ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాల పరిసరాలను శుభ్రపరిచారు. విద్యార్థులతో కలిసి ర్యాలీ చేశారు. వ్యాస రచన, పెయింటింగ్ పోటీలను నిర్వహించారు. ఎంఈవో పి.శ్రీనివాసరావు, సర్పంచ్ పప్పుల చిట్టమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. స్థానిక సీహెచ్‌సీ పరిసరాల్లో సూపరింటెండెంట్ పండా సతీష్ చెత్తా చెదారం తొలగించారు. హాస్పిటల్ కౌన్సెలర్ వాసు, సిబ్బంది పాల్గొన్నారు.

వై.రామవరం: పంచాయతీ కార్యదర్శి లోవరాజు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి స్థానిక బస్టాండు ఆవరణలో మానవ హారంగా ఏర్పడ్డారు. కార్యక్రమంలో తహసీల్దార్ పి. వేణుగోపాల్, ఎంపీడీవో రవికుమార్, ఏపీవో సాయిబాబ, తదితరులు పాల్గొన్నారు.

గూడెంకొత్తవీధి: ఎంపీడీవో ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో మండల కేంద్రంలో అధికారులంతా ప్రతిజ్ఞ చేశారు. ఐసీడీఎస్ సీడీపీవో లక్ష్మీదేవి, ఏవో మధుసూదనరావు ఉపాధి ఏపీవో రాంప్రపసాద్, డీటీ సీతారాం పాల్గొన్నారు.

కండ్రుమ్‌లో జెడ్పీ నిధులతో డ్రైనేజీల అభివృద్ధి



డ్రైనేజీ పరిశీలిస్తున్న వైస్ ఎంపీపీ ఆనంద్

డుంబ్రిగుడ: మండలంలోని కండ్రుమ్ పంచాయతీలో రూ.4 లక్షల జెడ్పీటీసీ నిధులతో డ్రైనేజీలు నిర్మించినట్లు వైస్ ఎంపీపీ, ఎంపీటీసీ శెట్టి ఆనంద్ తెలిపారు. ఈ సందర్భంగా శనివారం ఆయన పనులను పరిశీలించారు. నాణ్యతతో డ్రైనేజీ పనులు చేపట్టినట్లు తెలిపారు. నిధులు కేటాయించిన జెడ్పీటీసీ చటారి జానకమ్మకు కృతజ్ఞతలు తెలిపారు. మరికొంత నిధులు తమ పంచాయతీ అభివృద్ధికి కేటాయించాలని కోరారు.

18న అరకు వారపుసంత ఆశీల వేలం

డుంబ్రిగుడ: అరకులో శుక్రవారం వారపు సంతలో ఆశీల వసూలుకు ఈ నెల 18న వేలం పాట నిర్వహించనున్నామని పంచాయతీ కార్యదర్శి గుణలక్ష్మి తెలిపారు. వేలందారులు రూ.2 వేలు ధరావతు చెల్లించాల్సి ఉంటుందన్నారు.